క్లుప్తంగా

పెద్ద బీడు సర్వే

మధిర: మధిర మున్సిపాలిటీ సమీపంలోని పెద్ద బీడు సర్వే నంబర్ 53లో ఉన్న పొలాలను తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు ఆదేశాల మేరకు గురువారం సర్వే చేశారు. మండల సర్వేయర్ ఉషారాణి ఆధ్వర్యంలో సరిహద్దు పొలాల రైతులకు ముందుగా నోటీసులు అందజేశారు. ఈ నెల 9,10 తేదీల్లో సర్వే చేయగా తిరిగి రైతుల కోరిక మేరకు మరళా సర్వే చేయడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో గట్టిగుండె రవి, కటుకూరి శ్యామారావు, గద్దల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఐపీడీఎస్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో కాకర్లపల్లిరోడ్ ఫీడర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకర్లపల్లిరోడ్, మసీద్‌రోడ్, సురేష్‌సైకిల్‌షాప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరీక్షలపై భయం వీడాలి

మధిర: పరీక్షలంటే విద్యార్థులు భయం వీడి ప్రణాళికతో సిద్ధమైతే విజయం సులభమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వీవీ రాణా ప్రతాప్ అన్నారు. గురువారం మడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖమ్మం జిల్లా ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తోట నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన మున్సిపల్ చైర్మన్


మంత్రి పొంగులేటితో మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ గురువారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఎంపీపీ గోసు మధు, భూక్యా రాంబాబు పాల్గొన్నారు.

25న సాయిస్ఫూర్తిలో మాక్ ఎంసెట్

సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25వ తేదీ ఉదయం 9.30 గంటలకు మాక్ ఎంసెట్ నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ఇంటర్ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు.

రెమ్యూనరేషన్ చెల్లించాలి

మధిర: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి తక్షణమే రెమ్యూనరేషన్ చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మరెడ్డి కోరారు. గురువారం ఆ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే పూర్తి అయ్యి రెండు నెలలు గడిచినప్పటికీ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం శోచనీయమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర బాధ్యులు షేక్.మదార్, జిల్లా నాయకులు రవికుమార్, పిల్లి నరసింహారావు, అప్పారావు, శ్యామల రావు, సతీష్, నాగేశ్వరరావు, జ్యోతి, అనసూయ, సునీత, స్నేహిత పాల్గొన్నారు.

వేద పాఠశాలలో కల్యాణ మహోత్సవాలు

వైరా: వైరాలోని సనాతన భాగవత భక్త సమాజం వారిచే ఈ నెల 24, 25, 26 తేదీల్లో వైరా అయ్యప్ప స్వామి గుడి సమీపంలోని సత్య సాయి వేద స్మార్థ పాఠశాలలో శ్రీ సీతారామ కల్యాణం, సువర్చల హనుమత్ కల్యాణం, శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

సీపీఎం నాయకుల నిరసన

ఏన్కూరు: భూమిలేని ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ భరోసా కల్పించాలని సీపీఎం మండల నాయకుడు ఏర్పుల రాములు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తిమ్మారావుపేటలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, కోటేశ్వర రావు, సీతారాములు, రాములు, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.


కారేపల్లి బీసీ బాలుర వసతిగృహం


హాల్‌లో భోజనం చేస్తుండగా, బట్టలు మార్చుకుంటున్న మరికొందరు..


హాస్టల్‌కు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

అద్దె భవనంలో వసతిగృహం

- 35ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగింపు
- రెండేళ్లుగా అద్దెకట్టని వైనం
- ఆరుబయటే భోజనం, బహిరంగ స్నానాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కారేపల్లి: గత ముప్పై ఐదేళ్లుగా కారేపల్లిలోని బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. మూడు దశాబ్దాలు దాటిన, బీసీ విద్యార్థులకు కనీసం పక్కా వసతి గృహాన్ని నిర్మించటంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 65మంది విద్యార్థులు ఉన్న కారేపల్లిలోని బీసీ బాలుర వసతి గృహంలో, ఒకప్పుడు వివిధ ప్రాంతాల నుంచి వెనుబడిన తరగతుల విద్యార్థులు 150 నుంచి 200ల వరకు కారేపల్లి బీసీ హాస్టల్‌లో ఉండి చదువుకునేవారు. ఏళ్లు గడుస్తున్నా.. బీసీ బాలుర వసతి గృహానికి పక్కా భవనం నిర్మించకపోవటం, అసౌకర్యాలతో కూడిన అద్దె భవనంలో ఉండలేక ప్రతీ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గుకుంటూ వస్తుంది.

అద్దె భవనంలో అవస్థలు

అద్దె భవనంలో ఒకటే ఒక హాల్ ఉండటం, విద్యార్థుల పుస్తకాల పెట్టెలు అదే హాల్‌లో పెట్టుకోవటం, చదువుకోవటం, రాత్రివేళల్లో సైతం అక్కడే నిద్రించటంతో విద్యార్థులు ఇరుకు ఇరుకుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డైనింగ్‌హాల్ లేకపోవటంతో కొంతమంది విద్యార్థులు భోజనాలు ఆరుబయట భుజిస్తే, మరికొంతమంది హాల్‌లో కూర్చొని భుజించాల్సి వస్తుంది. దీనికి తోడు సరిపోను స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచి కొత్త మెనూ విధానాన్ని అమలు చేస్తున్నా.. పక్కా భవనం లేక విద్యార్థులు అద్దె భవనంలోనే అవస్థలు పడుతున్నారు.

స్థలం కేటాయించినా.. ఫలితం లేదు..

కారేపల్లిలోని ఇల్లందు రోడ్డులో ప్రభుత్వ స్థలం సర్వేనంబర్ 38లో బీసీ బాలుర వసతి గృహానికి 17గుంటల స్థలాన్ని ప్రభుత్వ అధికారులు కేటాయించారు. దీనికి సంబంధించి ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బోర్డు సైతం ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తున్నా.. బీసీ బాలుర వసతిగృహం పక్కా భవన నిర్మాణానికి స్థానిక అధికారులు గానీ, జిల్లా అధికారులు గానీ ఊసెత్తకపోవటంతో స్థానిక ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుంది. మూడు దశాబ్దాలుగా విద్యార్థులు అసౌకర్యాల అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత అధికారులు పక్కా భవన నిర్మాణానికి పూనుకోకపోవటం బాధాకరమని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వాపోతున్నారు.

వర్క్ ఆర్డర్ రావాల్సి ఉంది..

ఈ విషయమై.. బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్ మందుల ఈదయ్యను ఫోన్‌లో వివరణ కోరగా.. ఖమ్మం జిల్లాలో కారేపల్లితో పాటు, ముదిగొండ, ఖమ్మం రూరల్‌లో బీసీ బాలుర వసతి గృహాల పక్కా భవనాలకు రూ.3కోట్ల చొప్పున నిధులు మంజూరైయ్యాయి. సింగరేణి (కారేపల్లి) రెవెన్యూ ఆఫీస్ నుంచి సర్వే నంబర్ 38లో ప్రభుత్వ స్థలం 17గుంటలు బీసీ హాస్టల్ పక్కా భవన నిర్మాణానికి స్థలానికి కేటాయిస్తూ ప్రొసిసర్ వచ్చిందని.. వర్క్ ఆర్డర్ రావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

ఒత్తిడి ఉంది..



అద్దె భవనంలో అసౌకర్యాలు ఉన్న మాట వాస్తవమే. రెండేళ్ల నుంచి అద్దె సైతం చెల్లించటం లేదు. ఇంటి యజమాని నుంచి ఒత్తిడి ఉంది. ఈ విషయమై బీసీ సంక్షేమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుళ్లడం జరిగింది. త్వరలోనే అద్దె చెల్లిస్తాం. కారేపల్లి బీసీ బాలుర వసతి గృహానికి ప్రభుత్వ స్థలం 17గుంటలను రెండేళ్ల క్రితమే కేటాయించారు. నిధులు మంజూరు కాగానే, పక్కా భవనాన్ని నిర్మిస్తారని ఉన్నతాధికారుల సమాచారం.

– జె.వేణు, ఇన్‌చార్జ్ వార్డెన్, బీసీ హాస్టల్ కారేపల్లి

పక్కా భవనం నిర్మించాలి..



అద్దె భవనంలో సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందరం ఆరుబయటే స్నానాలు చేస్తున్నాం. భవనంలో ఒకటే హాలు.. అందులోనే పుస్తకాలు, పెట్టెలు, బట్టలు అన్నీ పెట్టుకోవాల్సి వస్తుంది. డైనింగ్‌హాలు లేక భోజనం నిలబడే చేయాల్సి వస్తుంది. మరుగుదొడ్లు సైతం సరిపోవట్లేదు. హాస్టల్‌కు సొంత భవనం ఉంటే బాగుంటుంది.

వై.అరుణ్‌కుమార్, 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ కారేపల్లి

విద్యార్థులకు రాగిజావ పంపిణీ


విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎస్‌బీఎస్ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నెల రోజులపాటు రాగిజావ అందించనున్నట్లు ప్రిన్సిపాల్ నళినిశ్రీ తెలిపారు. ఇంటర్ పరీక్షలు పూర్తి అయ్యేవరకు రాగి జావ అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

మధిర: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు శీలం నరసింహారావు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన వర్కర్ల వేతనాలను చెల్లించాలని కోరుతూ ఎంఈఓ ప్రభాకర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మురళి, మధు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సీసీ రోడ్డుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంజూరు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.12 లక్షల వ్యయంతో గ్రామంలోని రైతువేదిక నుంచి ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరభద్రం, వెంకటేశ్వర్లు, భాస్కర్, బస్వయ్య, రామకృష్ణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు..

మధిర: మైనర్లు వాహనాలను నడపడం నేరమని వైరా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. గురువారం ఆత్కూరు సమీపంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్లో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల కార్యక్రమంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం వల్ల అనేకమంది యువకులు వారి అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ అంజన్ బాబు, డైరెక్టర్ చందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వైరా: ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను గురువారం వైరాలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సుధాకర్, నాగేశ్వరరావు, మణి, శ్రీనివాస రావు, నరేంద్ర, కుటుంబరావు పాల్గొన్నారు.

దరఖాస్తులు అందించాలి

ఎర్రుపాలెం: గత నెల 31వ తేది వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు ఈ నెల 26వ తేదీలోపు మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో లేక స్థానిక రైతు వేదికల్లోని ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివసాయి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా పాస్ బుక్స్ వచ్చిన వారు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు, దరఖాస్తు ఫారం నింపి దరఖాస్తులు అందజేయాలన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు


ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో బాబాకి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబాని భక్తులు దర్శించుకుని పూజలు జరుపుకోగా.. అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

మధిరలో..


మధిర: నివాళులర్పిస్తున్న స్విమ్మర్లు

మధిర/సత్తుపల్లిటౌన్: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్మర్స్ నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదే విధంగా సత్తుపల్లిలోని రింగ్‌సెంటర్‌లో నేతాజీ విగ్రహానికి సుభాష్ యువజన సంఘం బాధ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి, మట్టా దయానంద్, ప్రసాద్, ప్రభాకర్‌రావు, సుజలరాణి, కమల్‌పాషా, రామ్మోహన్‌రెడ్డి, చెన్నారావు, ఆదినారాయణ, చిట్టిబాబు, సారధిరెడ్డి, ప్రసాదరావు, రాంబాబు, రాంబాబు, సతీష్, శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.


సత్తుపల్లిటౌన్: బోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యువజన సంఘం బాధ్యులు

మెరుగైన ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీఓ

మధిర: 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక జీపీఏ సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. గురువారం మండల పరిధిలోని సిరిపురం ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా వార్షిక పరీక్ష ఫలితాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం మురళీమోహన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

తల్లాడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సోలార్ ఇంటింటి సర్వే

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో సోలార్ విద్యుత్ కోసం గురువారం ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 10 టీమ్‌ల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటిని సర్వే నిర్వహించి సోలార్ ఉచిత విద్యుత్‌ను అందించనున్నట్లు తెలిపారు. పీఎం సూర్యగర్ పథకంలో భాగంగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ అధికారులే ప్రతి ఇంటికి వచ్చి సర్వే చేస్తారని, విద్యుత్ మీటర్లు వారి పేరు మీద లేకుండా మరొకరి పేరుపై ఉన్నట్లయితే వాటిని కూడా మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మనోహర్, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.


సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

వితరణల వెల్లువ..

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు..


విద్యార్థులకు అందించిన బ్యాగులతో ఎంఈఓ పుల్లయ్య, ట్రస్ట్ చైర్మన్ నాగప్రసాద్‌రావు

బోనకల్: బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని నారాయణపురం, చిన్నబీరవల్లి పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య, ట్రస్ట్ చైర్మన్ బత్తినేని నాగప్రసాద్‌రావు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్తినేని నాగప్రసాద్ మాట్లాడుతూ.. తన మనమడు బత్తినేని రేయాన్ పొదుపు చేసుకున్న కొంత నగదుతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను వితరణగా అందజేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆనందరావు, మాదవరావు, రవి, సుధాకర్, ప్రముఖ ఎన్ఆర్ఐ డాక్టర్ లలిత తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్తువులు..

కొణిజర్ల: మండలంలోని సిద్దిక్‌నగర్ గ్రామానికి చెందిన శీలం రంగారెడ్డి, మణి దంపతుల మనవడు శీలం రేయాన్ష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, జామెట్రీ బాక్స్‌లు, నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం ఖమ్మం నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో అనాథలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రేయాన్ష్ తల్లిదండ్రులు శీలం వెంకటేశ్వరరెడ్డి, సౌమ్య, పాఠశాల హెచ్‌ఎం సబర్మతి అన్నపూర్ణ, ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, శ్రీలక్ష్మి, స్థానికులు శాగం నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి జేవీఆర్ ఓసీ పీఓ నిమ్మలపూడి ప్రహ్లాద్ గురువారం రూ.10,116లను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి..


సాయి ధ్యాన మందిరంలో అన్నదానం చేస్తున్న భక్తులు

కల్లూరు: కల్లూరు పట్టణంలోని శ్రీ సాయిరామ ధ్యాన మందిరంలో గురువారం అన్నదాన కార్యక్రమం జరిగింది. కల్లూరు పట్టణానికి చెందిన వైన్ షాపుల సిబ్బంది రూ. 20 వేలు అన్నదానానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదనశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తోట జనార్దన్, కృష్ణ, రామారావు, సురేష్, రవీంద్ర, లక్ష్మణరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు బలరామ్, బావాజి, మొరళీకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూరియా అందించాలి

మధిర: రైతులకు యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు ఆరోపించారు. గురువారం మధిర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి పంటగా వేసిన వరి, మొక్కజొన్న, మిర్చి పంటలకు యూరియా ఎంతో అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు కొరత లేకుండా అందిస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం ఆ ఎరువులను రైతులకు అందించలేకపోతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు రమేష్, మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రవీంద్రారెడ్డి, మాదిరాజ్ సాయిరామ్ పాల్గొన్నారు.

నిరసనల మధ్యే ముగిసిన గ్రామసభలు

ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభలు గురువారం ముగిసాయి. చివరి రోజు నిర్వహించిన సభల్లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. సర్వేను తప్పుల తడకగా జరిపారంటూ ఆగ్రహం వక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఏ సర్వే ఆధారంగా అర్హులను ఎంపిక చేశారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. స్పందించిన అధికారులు ఈ జాబితా ఫైనల్ కాదని మరోసారి వడపోత జరుగుతుందని.. లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్


తల్లాడ: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఎంపీడీఓ చంద్రమౌళి, పక్కన కల్లూరు ఆర్డీఓ రాజేందర్


వైరా: రైతు వేదికలో లబ్ధిదారుల జాబితా చదువుతున్న అధికారులు


కల్లూరురూరల్: లింగాల గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ ప్రసాద్


కారేపల్లి: సింగరేణి గ్రామసభలో గందరగోళం


వైరారూరల్: విప్పలమడకలో అధికారులను ప్రశ్నిస్తున్న సీపీఎం నాయకులు


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో బారులుదీరిన జనం


పెనుబల్లి: వీయంబంజర్ గ్రామ సభలో ఘర్షణ పడుతున్న నాయకులు


వేంసూరు: కల్లురుగూడెంలో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు


చింతకాని: రామకృష్ణాపురం గ్రామసభలో..


బోనకల్: అధికారులను నిలదీస్తున్న మహిళలు